ప్రజాశక్తి
సోమవారం 7 నవంబర్ 2022
8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

కదలని కారిడార్

- పురోగతిలేని మౌలిక సదుపాయాలు
- రాని కొత్త పరిశ్రమలు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విశాఖపట్నం - చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్ (విసిఐసి) పనులు ముందుకు కదలడంలేదు. ఎగుమతి ఆధారిత తయారీగా పరిశ్రమలు ఏర్పాటుతో లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందని చెప్పి, రైతుల నుంచి భూములు సేకరణపై చూపిన శ్రద్ధ పరిశ్రమలను రాబెట్టడంలో ప్రభుత్వాలు చూపడంలేదు. విసిఐసిలో భాగంగా అచ్యుతాపురం, నక్కపల్లి క్లస్టర్ల కింద ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఎపిఐఐసి) వేలాది ఎకరాల భూమి సేకరించింది. భూములు కోల్పోయిన రైతులకు పరిహారం పూర్తి స్థాయిలో చెల్లించడంలోనూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు కేటాయించడంలోనూ పురోగతిలేదు. అచ్యుతాపురం క్లస్టర్ కింద ప్రయివేటు భూమి 1749.51 ఎకరాలు, ప్రభుత్వ భూమి 781.27 ఎకరాలు వెరసి 2530.78 ఎకరాలను సేకరించింది. అచ్యుతాపురం క్లస్టర్‌లో రెండు దశల్లో రాంబిల్లి మండలంలోని కృష్ణపాలెం, గోరపూడి, జెడ్.చింతువ, లాలం కోడూరులో అభివృద్ధి చేయాలని భావించారు. తొలిదశలో రూ.152 కోట్లతో అభివృద్ధి చేయడం ద్వారా ఫార్మాస్యూటికల్, కంట్రోల్ ఎక్విప్‌మెంట్, వైద్య పరికరాలు, సోలార్ పేనల్స్, డిఫెన్స్ ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలు వస్తాయని వేసిన అంచనా కార్యరూపం దాల్చలేదు. నక్కపల్లి క్లస్టర్‌లో జిరాయితీ భూమి 2,380.81 ఎకరాలు, ప్రభుత్వ భూమి 1737.82 ఎకరాలు వెరసి 4,318.63 ఎకరాలను ఎపిఐఐసి సేకరించింది. అందులో 1120 ఎకరాల్లో స్టార్టప్ ఏరియా కింద చందనాడ, వేంపాడు, డిఎల్ పురం, రాజయ్యపేట, బుచ్చిరాజుపేట గ్రామాల్లో అభివృద్ధి చేయాలని భావించారు. మిగిలిన 3198.63 ఎకరాలను నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసిడిసి) అభివృద్ధి చేయనుంది. దీంట్లో పెట్రో కెమికల్స్, కెమికల్ జోన్ ఇతర పరిశ్రమలకు కేటాయించనుంది. రూ.490 కోట్లతో 1120 ఎకరాల స్టార్టప్ ఏరియాను అభివృద్ధి చేయాల్సివున్నప్పటికీ నిధులు సమస్య వుండడంతో మౌలిక సదుపాయాల కల్పనలో ఆశించిన ప్రగతి కనిపించడంలేదు. ఈ ప్రాంతంలో ఫార్మాస్యూటికల్స్ కంపెనీలు, ఏరోస్పేస్, డిఫెన్స్, మెషినరీ ఫ్యాబ్రికేషన్స్, కాస్టింగ్ అండ్ ఫోర్జింగ్ వంటి పలు యూనిట్లు రావడం ద్వారా దాదాపు 18 వేల మందికి ఉపాధి లభించనుంది.



మాట్లాడుతున్న మంత్రి అమర్‌నాథ్, పక్కన ఎంపీ విజయసాయిరెడ్డి

ప్రధాని సభను విజయవంతం చేయాలి

అధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి అమర్‌నాథ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈ నెల 11న విశాఖకు వస్తున్న దేశ ప్రధాని నరేంద్ర మోడీకి రాష్ట్ర ప్రభుత్వం తరుపున ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రధాని మోడీ పర్యటన ఏర్పాట్లుపై ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడానికి మోడీ వస్తున్నారని చెప్పారు. ప్రధాని సభ జరిగే ప్రాంగణంలో ఎవరికి ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధాని సభకు పెద్ద ఎత్తున జనం హాజరవుతారని, వారిని ఎంత సురక్షితంగా సభకు తీసుకువస్తారో, తిరిగి వెళ్లేటప్పుడు అదే విధంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. సభలో ముందుగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రసంగిస్తారని, అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారని తెలియజేశారు. సభా ప్రాంగణం నుంచి ప్రముఖులు బయటకు వెళ్లిన తర్వాత సభికులను వారి వారి వాహనాల వద్ద వదిలి పెట్టాలని ఆయన సూచించారు. దీనిని రాజకీయ మిగతా 2లో..

ముగిసిన యోనెక్స్ సన్ రైజ్ బ్యాడ్మింటన్ టోర్నీ

▶ వార్త 2లో..

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం జగన్ ఆరాటం

▶ వార్త 2లో..

ప్రధాని మోడీతో ఉక్కు ప్రకటన చేయించాలి

▶ వార్త 8లో..



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న నాయకులు

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోనే వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ఉంచుతామని విశాఖ పర్యటనకు వస్తున్న ప్రధాని మోడీ ప్రకటించాలని టిఎన్‌టియుసి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉప్పిలి రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన దీక్షలు ఆదివారానికి 584వ రోజుకు చేరాయి. దీక్షల్లో టిఎన్‌టియుసి నాయకులు కూర్చున్నారు. ఈ మిగతా 2లో..

క్రీడా మౌలిక సదుపాయాలపై దృష్టి

- 'శాప్' ద్వారా పలు లీగ్‌లకు విశాఖ సారథ్యం
- గ్రామ స్థాయిలో ఫిట్ ఇండియా ప్రోగ్రాం
- ఆనందపురంలో 'ఖేలో ఇండియా'కు 10 ఎకరాల స్థలం
- 'ప్రజాశక్తి'తో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఎన్.సూర్యారావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లాలో క్రీడా మౌలిక వసతులపై దృష్టిసారిస్తూ క్రీడా ప్రాంగణాలను అభివృద్ధి చేయడం ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డిఎస్‌డిఒ) నగిరెడ్డి సూర్యారావు తెలిపారు. పట్టణ, నగర, గ్రామీణ ప్రాంతాల వరకూ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) స్ఫూర్తిని తీసుకెళ్లేందుకు 'రోడ్‌మ్యాప్' వేసుకున్నామని చెప్పారు. విశాఖ అనేక స్పోర్ట్స్ లీగ్‌లకు ఇప్పటికే సారథ్యం వహించిందన్నారు. దేశంలోనే క్రీడారంగంలో విశాఖను అగ్రగామిగా నిలిపే ప్రయత్నాల్లో భాగంగా 'ఖేలో ఇండియా' పథకంలో 10 ఎకరాల స్థలాన్ని ఆనందపురం ప్రాంతంలో చూశామని, దీనికి కేంద్రం రూ.50 కోట్లు మంజూరు చేసిందని అన్నారు. 'ప్రజాశక్తి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు



విషయాలను వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..



క్రీడా స్ఫూర్తిని పెంచే చర్యలు ఎలా ఉన్నాయి ? ప్రభుత్వాల ప్రోత్సాహం ఏ మేరకు లభిస్తోంది ?

కరోనా కాలంలో క్రీడా వ్యవహారాలు కుంటుపడ్డాయి. 2021 నుంచి మళ్లీ పుంజుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో పలు లీగ్‌లను శాప్ ఆధ్వర్యాన ఇక్కడ నిర్వహించాం. విశాఖ జిల్లాలో 15 క్రీడలను రాష్ట్ర, జిల్లా, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

క్రీడా మౌలిక సదుపాయాలపై దృష్టి

జోనల్ స్థాయిలో 'లీగ్స్'గా నిర్వహించాం. విశాఖ జిల్లా నుంచి 10 వేల మంది యువత పాల్గొన్నారు. ఫిట్ ఇండియా ప్రోగ్రాంలో విద్యార్థులంతా చురుకుగా పాల్గొన్నారు.

కొత్త కొత్త కార్యక్రమాలు ఏమైనా ఉన్నాయా?

'ఫిట్ ఇండియా ప్రోగ్రాం'ను అత్యంత ప్రతిష్టాత్మకంగా గ్రామస్థాయి వరకూ నిర్వహించాం. దీని ముఖ్య ఉద్దేశ్యం, లక్ష్యం ప్రతి ఒక్కరూ 30 నిమిషాల పాటు వ్యాయామం ప్రతిరోజూ చేయాలి. గ్రామాల్లో చైతన్యం తెచ్చాం. ఎంపిడిఒ, ఎంఇఒ, తహశీల్దార్‌ల భాగస్వామ్యంతో అక్టోబర్ 1 నుంచి 31 వరకూ 250 రన్స్ నిర్వహించాం. గ్రామాల్లో పిల్లలు, పెద్దలందరినీ కలుపుకుని 3 కిలోమీటర్ల రన్ నిర్వహించాం. గ్రామంలో వంద మందికి తక్కువ లేకుండా 250 గ్రామాల్లో చేపట్టాం. లాల్ బహదూర్ శాస్త్రి 'దివస్' సందర్భంగా మెగా రన్ నిర్వహించి 31న ముగించాం.

క్రీడల అభివృద్ధికి సరికొత్త ప్రయోగాలేమైనా చేపట్టారా?

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఎపి (శాప్) కొత్తగా యూట్యూబ్ ఛానల్ ప్రారంభించింది. క్రీడలకు సంబంధించిన అన్ని అంశాలూ అందులో అప్‌డేట్ అయిపోతున్నాయి. జరిగిపోయిన కార్యక్రమాలనూ దాంట్లో తిలకించవచ్చు. క్రీడా సంబరాల్లో భాగంగా శాప్ 4 ఈవెంట్లను నిర్వహిస్తోంది. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, షటిల్ బ్యాడ్మింటన్‌ను 17 ఏళ్లు పైబడిన వారి కోసం నిర్వహిస్తున్నాం. కేంద్ర ప్రభుత్వం ఈ పోటీల్లో మొదట స్థానం వచ్చిన విజేతకు రూ.50 లక్షలు నగదు బహుమతిని ప్రకటించింది. వార్డుల వారీగా సమాచారం జిల్లాలో ప్రజాప్రతినిధులందరికీ ఇచ్చాం. టీములు కూడా స్థానికంగానే నిర్ణయించబడతాయి. విశాఖపట్నం జోన్ పరిధిలో 6 జిల్లాలు ఉన్నాయి. జిల్లా స్థాయిలో మొదటి స్థానం వస్తే జోనల్ స్థాయిలో ఆడాలి. ఈ ఏడాది డిసెంబరు 21, 22 తేదీల్లో విజయవాడలో రాష్ట్ర స్థాయి పోటీలు ఉంటాయి. డిసెంబరు 21న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ 4 ఈవెంట్లలో రాష్ట్రంలో విజేతలైన వారికి నగదు బహుమతులు అందజేస్తారు. ఈ నెల 1 నుంచి నియోజకవర్గాల్లో ఈ పోటీలు ప్రారంభమై 10వ తేదీలోపు పూర్తికావాలి. జిల్లా స్థాయిలో 16వ తేదీలోపు, జోనల్ స్థాయిలో నవంబర్ 30లోపు ముగియాల్సి ఉంది.

ఇంకా ఏమైనా ప్రత్యేక పోటీలు, బహుమతులూ ఉన్నాయా?

జనవరిలో సిఎం కప్ కోసం 15 అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నాం. శాప్ ఆధ్వర్యాన జరుగనున్నాయి. దీంట్లో ఇచ్చే సర్టిఫికెట్ కూడా అత్యంత విలువైనది. ప్రతి జిల్లాలోనూ ఈ కప్ పోటీలు నిర్వహిస్తాం. రాష్ట్ర స్థాయిలో ప్రథమ బహుమతిగా రూ.10 లక్షలను జిల్లాకు ఇచ్చేందుకు నిర్ణయం జరిగింది. వైఎస్ఆర్ క్రీడా సంబరాలను విశాఖ జిల్లాలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాం. జాతీయ స్థాయిలోనైతే రూ.5 లక్షలు నగదు, బంగారు పతకం ఇవ్వనున్నాం. ఈ రకంగా 2021-22 మధ్య కాలంలో విశాఖ జిల్లాకు 70 లక్షల వరకూ పురస్కారాలు లభించడం విశేషం. విశాఖ నగరంలోని మురళీనగర్‌కు చెందిన జ్యోతి ఎర్రాజీ రూ.1.50 లక్షలను గుజరాత్ ఈవెంట్‌లో ఇటీవలే సాధించారు. ఆనందపురంలో అనుమతి లభించిన 10 ఎకరాల్లో అత్యంత ఆధునిక వసతులతో క్రీడా భవనం నిర్మాణం చేపట్టనున్నాం.

ప్రధాని సభను విజయవంతం చేయాలి

సభగా భావించకుండా చాలాకాలం తర్వాత రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోడీకి గౌరవ సభగా భావించాలని విజ్ఞప్తి చేశారు.

ఎంపీ విజయసాయిరెడ్డి మాట్లాడుతూ ప్రధాని మోడీ ఈ నెల 11న సాయంత్రం 7 గంటలకు విశాఖకు చేరుకుంటారని, ఆయనకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి స్వాగతం పలుకుతారని తెలియజేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి కాసేపు సమావేశమవుతారని చెప్పారు. 12న ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్స్‌లో జరిగే సభలో ఏడు పథకాలకు మోడీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. ప్రధాని సభకు భారీగా తరలివచ్చే జనానికి అవసరమయ్యే కనీస సౌకర్యాలు 10వ తేదీ నాటికి పూర్తి కావాలని అధికారులను కోరారు. ముఖ్యంగా తాగునీరు, టాయిలెట్స్, ఫస్ట్ ఎయిడ్ సెంటర్లను ఎక్కడికక్కడ ఏర్పాటు చేయాలని సూచించారు. 11 గంటలకు మోడీ సభ ప్రారంభమవుతుందని, 10 గంటలకే జనం సభా ప్రాంగణానికి వచ్చేటట్టుగా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ సభా ప్రాంగణానికి జనం తరలివచ్చే మార్గాలను నిరంతరం పర్యవేక్షించేందుకు 25 మందితో కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమును ఏర్పాటు చేశామని తెలియజేశారు. సమావేశంలో నగర పోలీస్ కమిషనర్ శ్రీకాంత్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, ఎమ్మెల్సీ కల్యాణి, కెకె.రాజు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ తగదు

సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మోడీపై ఒత్తిడి పెంచాలన్నారు.

విశాఖ విమానాశ్రయాన్ని యథావిధిగా కొనసాగించాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భోగాపురం విమానాశ్రయం ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని, అయితే విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయాన్ని కూడా కొనసాగించాలని యుపిఎస్‌సి మాజీ చైర్మన్, మాజీ వీసీ ఆచార్య కెయస్.చలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖ ప్రయాణికులకు భోగాపురం చాలా దూరం అవుతుందని, 40 కిలోమీటర్లు దూరంలో ఉండడం వల్ల సామాన్యులు సిటీలోకి రావాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పనని అన్నారు. దేశంలో ఏ ఎయిర్ పోర్టూ సిటీకి అంత దూరంలో లేదని తెలిపారు. అందుకే విశాఖ విమానాశ్రయాన్ని డొమెస్టిక్ ఎయిర్ పోర్టుగా ప్రయాణికులు వాడుకునేలా వుంచాలన్నారు.

ముగిసిన యోనెక్స్ సన్ రైజ్ బ్యాడ్మింటన్ టోర్నీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యోనెక్స్ సన్ రైజ్ ఆల్ ఇండియా సీనియర్ ర్యాంకింగ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ - 2022 విశాఖపట్నంలోని స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో ఆదివారంతో ముగిసింది. ముఖ్య అతిథిగా ఈస్ట్ కోస్ట్ రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక మంది అంతర్జాతీయ, జాతీయ స్థాయి క్రీడాకారులు పాల్గొన్న ఈ టోర్నమెంట్ విశాఖకు ఎంతో ప్రాముఖ్యతను పెంచిందన్నారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ పోటీల్లో పురుషుల సింగిల్స్‌లో ఎం.మిథున్, మహిళా సింగిల్స్‌లో అనుపమ ఉపాధ్యాయ, పురుషుల డబుల్స్‌లో దీప్ రంభియ, అక్షాన శెట్టి జోడీ గెలుపొందారు. మహిళల డబుల్స్‌లో ఖుషి గుప్తా, ప్రియా దేవి గెలుపొందారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో హేమ నాగేంద్రబాబు, కనిక కాన్వాల్ జంట గెలుపొందింది. ముగింపు కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు అంకం చౌదరి, విశాఖ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్, ఎసిపి చుక్క శ్రీనివాస్, సెక్రటరీ పల్లా శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉషశ్రీ , విల్లూరి భాస్కర్ పాల్గొన్నారు.



విజేతలతో రైల్వే డిఆర్ఎం అనూప్ సత్పతి, తదితరులు

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం జగన్ ఆరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : రాష్ట్రంలోని ప్రజా సమస్యల పరిష్కారంపై పవన్ కల్యాణ్ దష్టి సారిస్తుంటే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఆరాటపడుతున్నారని జనసేన పిఎసి సభ్యులు కోన తాతారావు ఆరోపించారు. ఆదివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం రాష్ట్రాన్ని రాక్షస పాలనలోకి నెట్టిందని విమర్శించారు. కేవలం జనసేన సభకు ఇప్పటం గ్రామస్తులు స్థలం ఇచ్చారనే కక్షతో 53 ఇళ్ళను అన్యాయంగా కూల్చి వేశారన్నారు. ఆ గ్రామానికి ఆర్‌టిసి బస్సు లేదని, మంగళగిరి మాస్టర్ ప్లాన్‌లో కనీసం రోడ్ లేదని, అటువంటప్పుడు 100 అడుగుల రోడ్డు వెడల్పు సాకుతో ఎలా కూల్చివేస్తారని ప్రశ్నించారు. ప్రైవేట్ స్థలం అయితే ముందుగా నోటీసులు ఇచ్చి, నష్టపరిహారం చెల్లించి రోడ్లు వేయాలని, అలా చేశారా అని అడిగారు. జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుకు నీటిని ఎలా కొలుస్తారో తెలియదన్నారు. జోగి రమేష్ ఒక ఇల్లునూ కూల్చలేదని అబద్ధాలు ఆడుతున్నారన్నారు. పవన్ కల్యాణ్ వారానికి ఒక రోజు వస్తారని మంత్రి అమర్‌నాథ్ అంటున్నారని, అలా అయితే ముఖ్యమంత్రి జగన్ 15 రోజులకు ఒకసారైనా బయటకు రారని, దానికి ఏమంటారని ఎద్దేవా చేశారు. నలుగురు రెడ్డిలతో జగన్ పాలన నడుస్తోందని, వీరంతా దసపల్లా, రుషికొండ, హయగ్రీవ భూములను కాజేస్తున్నారని ఆరోపించారు. విధానపరమైన విమర్శలు చేయాలని, రెచ్చగొట్టే విధంగా కాదని అన్నారు. చోడవరం నియోజకవర్గం జనసేన ఇన్‌చార్జ్ పివిఎస్ఎన్ రాజు మాట్లాడుతూ తాడేపల్లి నుండి వచ్చిన స్క్రిప్ట్‌ను మంత్రులు వల్లి వేస్తుంటారన్నారు. ఒక్క ఇరిగేషన్ ప్రాజెక్టునూ పూర్తి చేయలేక పోయారని, ఒక్క పరిశ్రమనూ విశాఖకు తీసుకు రాలేదని అన్నారు. కార్యక్రమంలో జనసేన ఉత్తర నియోజకవర్గం ఇన్‌ఛార్జ్ పసుపులేటి ఉషాకిరణ్, జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ పాల్గొన్నారు.

7న రాధాకృష్ణ మహోత్సవాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణ మహోత్సవాలను ఈ నెల 7వ తేదీన బీచ్ రోడ్‌లోని శ్రీరంగాపురం వద్ద ఉన్న గోకుల్ పార్క్ వద్ద నిర్వహించడానికి యాదవ సంక్షేమ సంఘం వారు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం శివాజీ పార్క్ వద్ద ఉన్న సవేరా ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఉమ్మడి విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒమ్మి సన్యాసిరావు యాదవ్, ఎం.అప్పారావు మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా కార్తీక మాసంలో కార్తీక పౌర్ణమి రోజున శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణ మహోత్సవ వేడుకలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. 7వ తేదీ ఉదయం 7 గంటలకు కలశ ప్రతిష్ట ఉంటుందని, అనంతరం 11 గంటల నుంచి సవేరా ఫంక్షన్ హాల్‌లో యాదవ సంక్షేమ సంఘం సభ్యులతో సమీక్ష ఉంటుందని, అనంతరం సాయంత్రం 6 గంటలకు యాదవుల సమస్యలు - స్థితిగతులపై తీర్మానం చేస్తామని తెలిపారు. అనంతరం శ్రీరంగాపురం సముద్ర తీరాన గోకుల్ పార్కు వద్ద బహిరంగ సభతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ ఉత్సవాలకు ఉత్తరాంధ్ర నాయకులు అందరూ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి సురేష్, 28వ వార్డు ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు, కె.రవికుమార్, కె.వేణుగోపాల్, గుంప అప్పారావు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

25న చలో ఢిల్లీ

ప్రజాశక్తి - కలెక్టరేట్ : దేశ వ్యాప్తంగా ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ అధ్వర్యంలో ఈ నెల 25న చలో ఢిల్లీ కార్యక్రమం చేపట్టినట్టు ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మహంకాళి సుబ్బారావు తెలిపారు. అల్లిపురంలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగిన సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు.

రైల్వే స్పోర్ట్స్ స్టేడియంలో

గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : నగరంలోని రైల్వే స్పోర్ట్స్ మైదానంలో ఏర్పాటు చేసిన గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రాన్ని వాల్తేరు డివిజనల్ రైల్వే మేనేజర్ అనూప్ సత్పతి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు ఏ రైల్వే డివిజనూ ఇంత గొప్ప గుర్రపు స్వారీ శిక్షణ కేంద్రం ఏర్పాట్లు చేయలేదన్నారు. రైల్వే అధికారులతో పాటు విశాఖ నగరానికి చెందిన వ్యక్తులు కూడా నిర్ణయించిన రుసుము చెల్లించి ఇక్కడ శిక్షణ పొందవచ్చని తెలిపారు. ఉదయం 6 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు ఈ కేంద్రం అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎడిఆర్ఎం సుధీర్ కుమార్ గుప్తా, మనోజ్ కుమార్ సాహూ, ప్రవీణ్ భాటి పాల్గొన్నారు.

తీర స్వచ్ఛతకు కృషి : కలెక్టర్



సాగర్ నగర్ తీరంలో చెత్తను సేకరిస్తున్న జిల్లా కలెక్టర్ మల్లికార్జున తదితరులు

ప్రజాశక్తి -మధురవాడ : తీరం స్వచ్ఛతకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పిలుపు నిచ్చారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్ సూచన మేరకు సాగర్‌నగర్ బీచ్‌లో ఉదయం 6 నుంచి 8 గంటల వరకు పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ యంత్రాంగం ఆధ్వర్యాన నగరంలోని సముద్ర తీర ప్రాంతాలను పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని ప్రతి నెలా మొదటి ఆదివారం విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన 6 విడతల బీచ్ క్లీన్ కార్యక్రమంలో 175 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించినట్లు చెప్పారు. రద్దీ ఎక్కువగా ఉండే బీచ్ ప్రాంతాలను 10 సంస్థలు దత్తత తీసుకున్నాయన్నారు.

ప్రతి రోజూ సదరు సంస్థల సభ్యులు ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతిరోజూ టూరిస్టులు విశాఖలోని వివిధ బీచ్ ప్రాంతాల్లో సందర్శిస్తుంటూరని, వీరికి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగించకుండా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, ఆర్‌డిఒ హుస్సేన్ సాహెబ్, ప్రభుత్వ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల కార్యకర్తలు, స్థానిక ప్రజలు, హెచ్‌పిసిఎల్ ప్రతినిధులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుండె పోటుతో మార్కెట్‌లో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : చేపలు కొనేందుకు తోటగరువు చేపల మార్కెట్‌కు వచ్చిన వ్యక్తి ఒక్కసారి కుప్పకూలాడు. దీంతో అక్కడ ఉన్నవారంతా ఒక్కసారి ఉలిక్కిపడి వెంటనే 108 ద్వారా కెజిహెచ్‌కు తరలించారు. ఆయన అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. కుప్ప కూలిన సమయంలోనే అతని ఫోన్ నుంచి కుటుంబ సభ్యులకు స్థానికులు సమాచారం అందించారు. మృతుడు పిఎం పాలెం, బాలాజీ హోమ్స్‌లో నివాసముంటున్న ప్రేమానంద శ్యామ్‌సన్(62)గా పోలీసులు పేర్కొన్నారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.



విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు అందిస్తున్న అతిథులు

ఎంఎస్ఆర్ఐటిలో 'ప్రేరణ'

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని సొంట్యాం వద్ద గల నడింపల్లి సత్యనారాయణ రాజు ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం మొదటి సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రేరణ కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ ఐటి ఎమ్ఎన్‌సి విప్రో హెడ్ గ్లోబల్ ప్రొఫెసర్ పిబి.కొట్టూర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్లోబల్ ప్రపంచంలో విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా డిజిటల్ విప్లవంలోనికి మారాలని సూచించారు. 2075 సంవత్సరం కల్లా భారతదేశం ఆర్థికవృద్ధిలో నెంబర్ వన్ అవుతుందన్నారు. ఇండస్ట్రీ 4.0లో అటానమేషన్ శిక్షణలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటాయని తెలిపారు. మార్పులకనుగుణంగా విద్యార్థులు నూతన ఒరవడిని అందిపుచ్చుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా మెరిట్ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ కె.రాంజీ, ఛైర్మన్ నడింపల్లి సత్యనారాయణ రాజు, డైరెక్టర్ మురుగదాస్, సెక్రటరీ ప్రసాద్‌రాజు, ట్రెజరర్ కనకరాజు, డీన్ శర్మ పాల్గొన్నారు పాల్గొన్నారు.

గళ మాధుర్యాన్ని పంచిన 'శృతిలయ'

విశాఖపట్నం: శృతిలయ భక్తి, లలిత, సినీ సంగీత సేవా సంస్థ ఆధ్వర్యాన అల్లూరి విజ్ఞాన కేంద్రం ప్రధాన ఆడిటోరియంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. శశి వదనే.. శశి వదనే శీర్షికన నిర్వహించిన కార్యక్రమాన్ని సెంచూరియన్ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య జిఎస్ఎన్ రాజు, సోషల్ మీడియా స్టేట్ ఛైర్మన్ సన్ మూర్తి, యోగా గురువు రాజు, సంగీత సంస్థల ప్రతినిధులు ఫణి స్వామి, డాక్టర్ ఉషా చీరాల, కందర్పరాధ, చెన్నా తిరుమలరావు, తదితరులు కార్యక్రమం ప్రారంభించారు.



కేక్‌ను కట్ చేస్తున్న హేమలత

ఘనంగా కార్పొరేటర్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి -మధురవాడ : జీవీఎంసీ ఐదవ వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత జన్మదిన వేడుకలు ఆదివారం బొట్టవానిపాలెంలోని నివాసంలో ఘనంగా నిర్వహించారు. హేమలతకు భీమిలి నియోజకవర్గం టిడిపి సమన్వయకర్త కోరాడ రాజబాబు, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి గాడు చిన్నికుమారిలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఏడో వార్డు కార్పొరేటర్ పిల్ల మంగమ్మవెంకట్రావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంట నూకరాజు, విశాఖ పార్లమెంటరీ జిల్లా ఉపాధ్యక్షుడు వాండ్రసి అప్పలరాజు, పార్లమెంటరీ జిల్లా కమిటీ కార్యదర్శి నాగోతి సూర్యప్రకాష్, భీమిలి నియోజకవర్గం మహిళా అధ్యక్షులు బోయి రమాదేవివెంకటరమణ, గొడి అరుణకుమారి సమక్షంలో హేమలత కేక్ కట్ చేశారు. వారంతా కార్పొరేటర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్ చేస్తున్న ప్రజా సేవపై పలువురు కొనియాడారు. ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆశీర్వదించారు. ఈ వేడుకలలో 5వ వార్డు టిడిపి అధ్యక్షులు నాగోతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఈగల రవికుమార్, సీనియర్ నాయకులు నమ్మి శ్రీను, 7వ వార్డు ప్రధాన కార్యదర్శి కనూరి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విమ్స్‌లో కీళ్ల నొప్పులపై మెడికల్ క్యాంపు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్)లో మంగళ, బుధవారాలలో మెగా ఆర్థో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ డాక్టర్ కె..రాంబాబు తెలిపారు. రెండు రోజులు పాటు నిర్వహించే ఈ మెడికల్ క్యాంపులో తీవ్ర కీళ్ల నొప్పులు, నడుము నొప్పులు, వృద్ధాప్యపు నొప్పులతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. రూ.2,000 విలువచేసే ఎముకుల సాంద్రత పరీక్ష బిఎండి, సీరం యూరిక్ యాసిడ్ పరీక్షలను ఉచితంగా రోగులకు చేస్తున్నట్లు తెలిపారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విమ్స్ పోర్టుకోలో శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

జూలో పర్యాటక సందడి

ప్రజాశక్తి - ఆరిలోవ

నగరంలోని వివిధ ప్రాంతాలతో పాటు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన సందర్శకులతో ఇందిరాగాంధీ జంతు ప్రదర్శనశాల, కంబాలకొండ, ముడసర్లోవ పార్కులు సందడిగా మారాయి. చిన్న, పెద్ద, వృద్ధులు తమ కుటుంబాలతో కలిసి వచ్చారు. వివిధ పాఠశాల విద్యార్థులు, కుల సంఘాలు, ఉద్యోగ సంఘాల సభ్యులు రావడంతో పార్కులన్నీ కిటకిటలాడాయి.



కైలాసగిరిపై జన తాకిడి



జూలో సందడి చేస్తున్న విద్యార్థులు

జూ పార్కు ఆదాయం రూ.5.29 లక్షలు

జంతుప్రదర్శన శాలను ఆదివారం 9,179 మంది సందర్శించారు. వీరి ద్వారా జూ పార్కుకి రూ.5 లక్షలా 29 వేలా 340 ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు.

పలుచోట్ల 'ప్రజా సంకల్పయాత్ర' వేడుకలు

ప్రజాశక్తి - యంత్రాంగం

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్రను పూర్తి చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఆదివారం వేడుకలు నిర్వహించారు. వైఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

ఎంవిపి.కాలనీ : వైసిపి జిల్లా కార్యాలయంలో పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ప్రజా సంకల్పయాత్ర వేడుకలకు ఎంపీ ఎంవివి.సత్యనారాయణ, విశాఖ నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ ఛైర్మన్ సుభద్ర, శాసనసభ్యులు నాగిరెడ్డి, శాసన మండలి సభ్యులు వరుదు కల్యాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాజశేఖరరెడ్డి ప్రజాప్రస్థానం యాత్రలోనూ, జగన్మోహన్‌రెడ్డి ఓదార్పు యాత్రలోనూ, షర్మిల పాదయాత్రలోనూ, ప్రజా సంకల్ప యాత్రలోనూ పాల్గొన్న అతి కొద్ది మందిలో ఒకరైన తిప్పల నాగిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి రవి రెడ్డి, వివిధ కార్పొరేషన్ల ఛైర్మన్లు జాన్ వెస్లీ, కోలా గురువులు, పిల్లా సుజాత, పిల్లి సుజాత, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు యువశ్రీ, విజయచందర్, పార్టీ నాయకులు కంపా హనోక్, వుడా రవి, ద్రోణంరాజు శ్రీవాత్సవ, వివిధ వార్డుల కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ నియోజక వర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ ఆధ్వర్యాన వైఎస్.రాజశేఖర రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు గాడు వెంకటప్పడు, నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు అక్కరమాని రామునాయుడు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నాగిరెడ్డిని సత్కరిస్తున్న మేయర్, విశాఖ ఎంపీ తదితరులు

సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు ఆధ్వర్యాన పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కంపా హనుక్, అల్లు శంకరరావు, కార్పొరేటర్లు కె.అనీల్‌కుమార్ రాజు, సాడి పద్మరెడ్డి, ఆళ్ళ లీలావతిశ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, రెయ్యి వెంకటరమణ, శశికళ, కో-ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు కె.వెంగళరావు, వార్డు ఇన్‌ఛార్జులు పైడి రమణ, నీలి రవి, జివి.రమణి, పెడాడ రమణికుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆనందపురం : ఆనందపురం కూడలిలో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్, సిఇసి మెంబర్ కాకర్లపూడి శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు బంక సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకట్రావు, కోరాడ అప్పలస్వామినాయుడు, రౌతు శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కరాటే కప్‌ను ఆవిష్కరిస్తున్న కెకె.రాజు తదితరులు

క్రీడలకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-సీతమ్మధార : క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు అన్నారు. జివిఎంసి 14వ వార్డులోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఫస్ట్ సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం వస్తుందన్నారు. అనంతరం గ్రేట్ కరాటే ఛాంపియన్‌షిప్ కప్ ను కెకె.రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 14వ వార్డు కార్పొరేటర్ కె.అనీల్‌కుమార్‌రాజు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

9న జాబ్ మేళా

ప్రజాశక్తి -కంచరపాలెం : విశాఖపట్నం జిల్లాలోని వివిధ కంపెనీలలోఉద్యోగాల భర్తీకి కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.సుధ (టెక్నికల్) తెలిపారు. కెఫ్‌సి సంస్థలో టీమ్ మేనేజర్ ఉద్యోగాలు 50 ఖాళీలకు ఎస్ఎస్‌సి ఆపైన విద్యార్హత గల స్త్రీపురుష అభ్యర్థులు, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందన్నారు. సిఎంఆర్ గ్రూప్ సంస్థలో సిఎస్ఎ 200 ఖాళీలకు ఎస్ఎస్‌సి ఆపైన విద్యార్హతగల స్త్రీ పురుష అభ్యర్థులు, 18 నుంచి 21 సంవత్సరాల మధ్య ఉన్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందన్నారు. అపోలో హోమ్ కేర్ సంస్థలో హోమ్ కేర్ నర్సు, హోమ్ కేర్ నర్సింగ్, అసిస్టెంట్స్ పేషెంట్ కేర్ అసిస్టెంట్, ఉద్యోగాలు 50 ఖాళీలకు జిడిఎ, ఎఎన్ఎం, జిఎన్ఎం, బిఎస్‌సి నర్సింగ్ విద్యార్హత గల స్త్రీపురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 నుంచి రూ.28,500 జీతం ఉంటుందని పేర్కొన్నారు. గుడ్ వర్కర్ ఫర్ పేటీఎం జస్ట్ డయల్ సంస్థలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్ 100 ఉద్యోగాలకు ఎస్ఎస్‌సి ఆపైన విద్యార్హత గల పురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.18,400 నుంచి రూ.22,600 వరకు జీతం ఉంటుందని వివరించారు. బి న్యూ మొబైల్స్ సంస్థలో సిఎస్ఎ ఉద్యోగాలు 10 ఖాళీలకు ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగి, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య ఉన్న స్త్రీపురుష అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.10 వేలు జీతం ఉంటుందన్నారు. బిగ్ బాస్కెట్ సంస్థలో డెలివరీ ఎగ్జిక్యూటివ్ 50 ఖాళీలకు ఇంటర్ ఆపైన విద్యార్హత గల పురుష అభ్యర్థులు 18 నుంచి 35 సంవత్సరాల మధ్య గలవారు అర్హులని పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.12 వేలు జీతం ఉంటుందని తెలిపారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు నేషనల్ కెరీర్ వెబ్‌సైట్ ncs.gov.in లో తమ వివరాలను రిజిస్టర్ చేసుకొని బయోడేటా, సర్టిఫికెట్లతో ఆ రోజు ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.



పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో ప్రసాద్ తదితరులు

పలుచోట్ల ఓటర్ల నమోదు

ప్రజాశక్తి-యంత్రాంగం

సీతమ్మధార : ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదును 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యాన రెల్లి వీధిలో చేపట్టారు. ఉత్తర నియోజకవర్గంలోని ప్రతి వార్డులో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి పట్టభద్రులకు అవగాహన కల్పించి ఓటర్ నమోదు చేయిస్తున్నట్లు గోవింద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

50వ వార్డులో..

మాధవధార : మాధవధారలోని 48 ఎ బస్టాప్ వద్ద 50వ వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ ఆధ్వర్యాన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో వార్డ్ వైసిపి నాయకులు పొన్నాడ అప్పారావు, సనపల నారాయణస్వామి, దాలినాయుడు, చంద్రమౌళి, సనపల ధనుంజయ్, కులత్వర్ స్వామి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములకు రెక్కలు

పట్టని అధికారులు
రోడ్డు విస్తరణ ఉన్నా ప్లాన్ మంజూరు

ప్రజాశక్తి-పెందుర్తి : జివిఎంసి జోన్-8 పరిధిలోని ప్రభుత్వ భూములకు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టడంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జోనల్ అధికారులు నిద్రావస్థలో ఉన్నారని పలువురు విమర్శిస్తున్నారు. పెందుర్తి మండలంలో జివిఎంసి 92 నుంచి 96వ వార్డు వరకు ప్రభుత్వ భూములు ఎక్కువగా ఉన్నాయి. స్కీమ్ ఇళ్ల ముసుగులో అనేక ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయి. జివిఎంసి అధికారులు ప్లాన్ ఇచ్చారని రెవెన్యూ అధికారులు, రెవన్యూ వారు భూములను కాపాడుకోవాలని జివిఎంసి అధికారులు ఒకరిపై నిందలు వేసుకుంటూ పోతున్నారే తప్ప ప్రభుత్వ భూములను కాపడటంలేదు.

97వ వార్డు పరిధి చినముసిడివాడ సర్వే నెంబర్ 106లో ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమికి పక్కన ఉన్న జిరాయితీ సర్వే నంబర్ వేసి ప్లాన్ తెచ్చుకొని బహుళ అంతస్తు నిర్మిస్తున్నారు. మాస్టర్ ప్లాన్‌లో 60 అడుగుల రోడ్డు కూడా ఉంది. దీనిపై స్థానిక టిడిపి నాయకుడు జివిఎంసి అధికారులను పలుమార్లు అడిగినా స్పందించలేదు. ఈ కబ్జాను 97వ వార్డు కార్పొరేటర్ వసంత కౌన్సిల్లోనే లేవనెత్తారు. జోన్‌లో ఇలాంటి కబ్జాలు కోకొల్లోలుగా జరుగుతున్నా, ప్లాన్ లేకున్నా నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆమె నిలదీశారు.

జోన్ -8 పరిధిలో కొద్ది నెలలుగా ఎసిపి లేరు. ఇన్‌ఛార్జి ఎసిపి రమణమూర్తితో కాలం వెళ్లదీస్తున్నారు. జోన్ మొత్తానికి ఒకే బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. అక్రమాలను బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ప్లానింగ్ సెక్రటరీ, చైన్ మ్యాన్ తదితరులు కింద స్థాయి నుంచి అంతా నడిపించేస్తున్నారని, దీంతో అనధికార నిర్మాణాలపై చర్యలు ఉండటంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి జివిఎంసికి వచ్చే ఆదాయాన్ని కాపాడాలని పలువురు కోరుతున్నారు.

డివైఎఫ్ఐ ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మాధవధార : డివైఎఫ్ఐ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాధవధార ఎస్సీ బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులను స్త్రీ వైద్య నిపుణులు డాక్టర్ నిర్మల పరీక్షించారు. ఆరోగ్య రక్షణకు పలు సూచనలు చేశారు. చదువుపై దృష్టి పెట్టడానికి ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ విజయ మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యం బలోపేతానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధి ప్రదర్శించాలని కోరారు. పేదలకు వైద్యం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సహకరించిన శ్రీ వాత్సల్య చారిటబుల్ ట్రస్టుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, శ్రావణ్ కుమార్, హరి, మురళీ, ఉదయ తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ నిర్మల

వార్డుల్లో రక్తదాన శిబిరాలు



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి -గాజువాక : రక్తదానం చేయడానికి యువత ముందుకు రావాలని స్టీల్‌ప్లాంట్ జనరల్ మేనేజర్ (సేఫ్టీ) దువ్వాడ రాంప్రసాద్ కోరారు. అగనంపూడి సిడబ్ల్యుసిలో లైఫ్ కేర్ బ్లడ్ బ్యాంకు ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ మాట్లాడుతూ, శరీరంలో జరిగే జీవన ప్రక్రియలో రక్తం ఉత్పత్తి ఒక అద్భుతమైన ప్రక్రియ అన్నారు. లైఫ్ షేర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ, రక్తదానం అవయవ దానంతో సమానమన్నారు. 18 సంవత్సరాల నుంచి 65 సంవత్సరాల వరకు ఉన్నవారు ప్రతి మూడు నెలలకోసారి రక్తదానం చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ పిఆర్ఒ లక్ష్మణ్, అగనంపూడి సిడబ్ల్యుసి అధ్యక్షులు ఎం.జయరాజు, ఎడిసి చైర్మన్ సత్యనారాయణ, వైసిపి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వెంపలినగర్ భజన మండలి ఆధ్వర్యాన...

గాజువాక : సత్య సాయిబాబా 97వ జయంతిని పురస్కరించుకొని పెదగంట్యాడ సమితి, వెంపలినగర్ భజన మండలి ఆధ్వర్యాన అమ్మ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో ఆదివారం ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరాన్ని 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకట్రామయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా వంశీరెడ్డి మాట్లాడుతూ, మనమిచ్చే రక్తం మరొకరి ప్రాణానికి సంజీవిని వంటిదన్నారు. అత్యవసర పరిస్థితులలో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలను కొల్పోతున్నారని అవేదన వ్యక్తం చేశారు.

ఆపద సమయంలో రక్తం అందక చనిపోతున్న వారిని కాపాడేందుకు ఇటువంటి రక్తదాన శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య మాట్లాడుతూ, అన్ని దానాలకన్నా రక్తదానం ఎంతో గొప్పదన్నారు. ఈ కార్యక్రమంలో భూపతిరాజు శ్రీనివాస్ రాజు, నిర్వాహకులు గళ్ళ శంకర్‌సాయిరాం, గంధం సాయి, పోలీస్ నాయుడు, గోరుసు సత్యం, పుతి తాతరెడ్డి, పైడికొండ, గోరుసు రామలక్ష్మి, లోకేష్, మండల గోవింద, అప్పలరెడ్డి, దుర్గ రెడ్డి, సింగ్, సత్య సాయిబాబా భక్తులు, వెంపలినగర్ గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాలలో...

కరాస : ఎన్ఎడి జంక్షన్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో సంస్థ చైర్‌పర్సన్ ఝాన్సీలక్ష్మీభాయ్ జన్మదినం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. డాక్టర్ ఎఎస్.రాజా బ్లడ్‌బ్యాంకు సహకారంతో ఏటా నవంబర్ 6వ తేదీన రక్తదాన శిబిరం నిర్వహిస్తునట్లు విశాఖపట్నం శ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ ఇన్‌ఛార్జి వై.ఆశీబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కళాశాలలు, పాఠశాలల సిబ్బంది, విద్యార్థుల తలిదండ్రులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహేష్, డీన్స్ సురేష్ , సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీని అరికట్టాలి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక గణేష్ సినిమా థియేటర్ సమీపం కొత్తపేటకు వెళ్ళే మార్గంలో జివిఎంసికి చెందిన కుళాయి లీకై తాగునీరు వృథా అవుతుందని వెంటనే మరమ్మతులు చేయాలని నేషనల్ ఫెడరేషన్ హ్యుమన్ రైట్స్ కౌన్సిల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్.రామలక్ష్మి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆ ప్రాంతాన్ని పలువురు స్థానికులతో కలిసి పరిశీలించారు. పైపులైన్ల లీకేజీలు జరగకుండా శాశ్వత చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

జిమ్సర్, రోటరీ
మెగా ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ (జిమ్సర్), రోటరీ క్లబ్ విశాఖ పెరల్ సిటీ, గీతం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ సంయుక్తంగా ఆదివారం స్థానిక జోడుగుళ్ళపాలెంలో మెగా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గీతం కేంపస్ లైఫ్ ప్రో వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు శిబిరాన్ని ప్రారంభించారు. జిమ్సర్ ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామాంజనేయులు, వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జ్యోతిపద్మజ, గీతం ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ చల్లా సురేఖ, డాక్టర్ స్వాతి చిక్కాల, డాక్టర్ సౌదామిని, రోటరీ క్లబ్ విశాఖ పెరల్ సిటీ అధ్యక్షులు సురేఖ పట్నాయక్, సహాయ గవర్నర్ యుపి.పట్నాయక్ తదితరులు హాజరయ్యారు. దాదాపు 500 మంది వివిధ పరీక్షలు చేయించుకున్నారు. ఉచితంగా మందులను పంపిణీ చేశారు. దీర్ఘ కాలిక వ్యాధులతో ఉన్న వారిని గుర్తించి జిమ్సర్ ఆసుపత్రికి రావాలని సూచించారు. స్థానిక మెరైన్ సిబ్బంది ఎస్ఎస్.గిల్ ఆధ్వర్యాన సహకారం అందించారు.

అవయవదానంపై అవగాహన

ప్రజాశక్తి -ఆరిలోవ : ప్రమాదవశాత్తూ బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తులు అవయవాలను కుటుంబీకులు దానం చేసేందుకు ముందుకు వచ్చేలా అవగాహన కల్పించడం అందరి బాధ్యత అని జీవన ధాన్ ప్రోగ్రాం రాష్ట్ర కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు అన్నారు. శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ మెయిన్ బ్రాంచ్‌లో ఆదివారం అవయవదానంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాంబాబు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా అవయవాల కోసం ఎదురుచూస్తూ వేలమంది చీకటి జీవితాలు గడుపుతున్నారన్నారు. వారి జీవితాలలో వెలుగులు నింపేందుకు అవయవ దానం ఒకటే సరైన మార్గం అన్నారు. ఇందుకోసం ప్రజలను చైతన్య పరచాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. తమ చుట్టూ ఉన్నవారికి, తల్లిదండ్రులకు అవయవదానంపై అవగాహన కల్పించాలని కోరారు. గత రెండేళ్లగా రాష్ట్రంలో అవయవ దానంపై అనేక ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించేందుకు ప్రణాళికలను రూపొందించామని చెప్పారు. ఈ అవగాహన కార్యక్రమాల్లో విద్యార్థులను, యువతను భాగస్వామ్యం చేయనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైతన్య కాలేజీ ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమగ్ర భూ రీ సర్వేపై ప్రచారమేదీ?

- కాగితాల్లోనే గ్రామ సభలు
- ఒకటి రెండు మినహా ఎక్కడా నిర్వహించని వైనం
- రైతుల్లో గందరగోళం



ప్రజాశక్తి - పరవాడ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ రీ సర్వే (వైఎస్సార్ జగనన్న భూరక్ష, శాశ్వత భూ హక్కు)పై ప్రజలకు తెలియజేయడంలో అధికారుల వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముందుగా గ్రామసభలు నిర్వహించి, రీ సర్వే ఏ రోజు చేసేది, దానికి రైతులు ఏమి చేయాలో తెలియజేయాల్సి ఉండగా, గ్రామసభలు నిర్వహించకుండానే పరవాడ మండలంలో రీ సర్వేకు అధికారులు సిద్ధమయ్యారు. దీంతో స్థానిక రైతుల్లో గందరగోళం నెలకొనగా, బయట ప్రాంతాల్లో ఉన్న రైతులకు అసలు సమాచారమే తెలియని పరిస్థితి ఉంది.

వందేళ్ల తర్వాత రాష్ట్రంలో చేపడుతున్న ఈ భూ రీ సర్వే ద్వారా భూ వివాదాలు పరిష్కరించబడతాయని వైసిపి ప్రభుత్వం చెబుతున్న మాట. పరవాడ మండలంలో 18 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఇప్పటికే డ్రోన్ల సహాయంతో సరిహద్దులు నిర్ణయించారు. డ్రోన్ చిత్రాలు రావాల్సి ఉంది. మొదటి ఫేజ్‌లో ఇ.మర్రిపాలెం గ్రామంలో రీ సర్వే నిర్వహించారు. అయితే ఆ గ్రామంలో రైతుల సమస్యలు తీర్చకుండానే సర్వే ముగించేశారు. ఇప్పుడు రెండో ఫేజ్‌లో సోమవారం నుంచి తానాం, భర్నికం, పిఎన్.భోనంగి, పిఆర్.భోనంగి. పి.భోనంగి, కలపాక, పెదముషిడివాడ, కన్నూరు, పరవాడ తదితర 9 రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే చేపట్టనున్నారు.

రీ సర్వేకు ముందు ఆయా రెవెన్యూ గ్రామాల్లో వారం రోజులు పాటు రైతులకు అవగాహన కలిగించే విధంగా ప్రచారం చేయాలి. వాల్ పోస్టర్లు, ఎలక్ట్రానిక్, ఇతర ప్రసార సాధనాల ద్వారా రైతులకు రీ-సర్వే వివరాలు పూర్తిగా వారికి తెలిసే విధంగా ప్రచారం చేపట్టాలి. గ్రామసభ నిర్వహించి భూ రీ సర్వే ప్రాధాన్యత తెలియజేయడంతో పాటు ఏ తేదీన సర్వే చేస్తుంది చెప్పి రైతులను సంసిద్ధులను చేయాల్సి ఉంది. కాని పరవాడ మండలంలో అధికారులు గ్రామసభలు నిర్వహించకుండానే రీ సర్వేకు పూనుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సోమవారం ప్రారంభం కానున్న 9 రెవెన్యూ గ్రామాల్లో భర్నికం, పరవాడలో మాత్రమే గ్రామసభలు జరిగాయి. మిగిలిన గ్రామాల్లో గ్రామసభలు రికార్డులకే పరిమితం అయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గ్రామాల్లో ఉన్న రైతుల నుండి వాలంటీర్ల ద్వారా పాస్ పుస్తకాలు, 1బి కాపీలు, ఆధార్ కార్డులు సేకరించారు. కానీ రీ-సర్వే గురించి గ్రామ సభలు నిర్వహించ లేదు. దీనికి తోడు ఎటువంటి ప్రచారం చేపట్టలేదు. దీంతో సర్వే చేయబోతున్న గ్రామాల్లోని రైతుల్లో గందరగోళ పరిస్థితి నెలకొంది. బయట గ్రామాల్లో ఉన్న రైతులు తమకు సమాచారం తెలియదని అంటున్నారు.

రీ-సర్వే పేరుతో రెవెన్యూ యంత్రాంగం హడావుడిగా గందరగోళంగా సర్వే చేసి చేతులు దులుపుకుంటున్నట్లు కనిపిస్తుందని, ఇలా అయితే నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో ప్రచారం చేసి, గ్రామ సభలు నిర్వహించి రీ-సర్వేలో వివాదాలు రాకుండా రైతులకు ముందుగా అవగాహన కల్పించిన తర్వాతనే సమగ్ర భూ సర్వే చేయాలని రైతులు కోరుతున్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఆర్ఒ వెంకటరమణ

పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- అనకాపల్లి

గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై పట్టణంలో ఆదివారం పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. హరితంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతినెల పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొణతాల ఫణి భూషణ్ శ్రీధర్‌ను అభినందించారు. కోస్టల్ బ్యాంకు మేనేజర్ మురళి మాట్లాడుతూ జీవ వైవిధ్యం ద్వారా మానవ మనుగడ సాధ్యమని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలన్నారు. గ్రీన్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ఫణి భూషణ్ మాట్లాడుతూ తమ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణకు 20 ఏళ్లుగా విశేష కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు బీర వినోద్ కుమార్, ఎస్ఎఫ్ఐ సత్యనారాయణ, శేష సాయి, కర్రి హనుమంతరావు, ఎన్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పరిపాలన రాజధానిని అడ్డుకుంటున్న టిడిపి : ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం

విశాఖను పరిపాలన రాజధానిగా చేయడానికి వైసీపీ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, దానిని అడ్డుకోవడానికి టిడిపి, దాని అనుబంధ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆరోపించారు. విశాఖ పరిపాలన రాజధాని రావడం టిడిపికి ఇష్టం ఉందో లేదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర చేసి ఐదేళ్ళ పూర్తయిన సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం కేక్ కట్ చేసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చోడవరం ప్రాంతంలో ప్రభుత్వ గనులను కొల్లగొడుతున్నది టిడిపి వారిని విమర్శించారు. నియోజకవర్గంలోనూ, చోడవరం పట్టణంలోనూ రోడ్ల విస్తరణ కార్యక్రమం చేపట్టితే దానిని టిడిపి అడ్డుకుంటుందని తెలిపారు. ఈనెల 12న ప్రధానమంత్రి బహిరంగ సభను విజయవంత చేయడానికి నియోజకవర్గం నుండి 15వేల మందిని తరలించడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బి సూర్యనారాయణ, జి శంకర్రావు, వెంకట్రావు, పెనుపోలు వెంకటేశ్వర్లు, పల్ల నర్సింగరావు, దేవరపల్లి సత్య, అల్లాడ భవాని, ఎర్ర చంద్రకళ, శ్యామల, మడక అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణాన్ని పరిశీలించిన సర్పంచ్

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల గ్రామంలో నిర్మాణంలో ఉన్న శ్మశాన వాటిక రహదారిని ఆదివారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మొగసాల లక్ష్మి వెంకట్, ఎంపీటీసీ సభ్యులు పన్నీరు వెంకటలక్ష్మి చంటి, వార్డు మెంబర్ తర్ర సత్యారావు, యోగ బోధకులు బుదిరెడ్డి నరసింగరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ పెంటయ్యనాయుడు తదితరులు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముత్యాల వెంకటేశ్వరరావు తదితరులు

ఎంవిఆర్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎంవిఆర్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు, ఆయన తనయుడు సతీష్‌ను ఆదివారం వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రింగ్ రోడ్డులోని పెంటకోట కన్వెన్షన్ హాల్లో జరిగిన వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ కాన్ఫరెన్స్‌కు ఎంవిఆర్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి క్లబ్ చేస్తున్న సేవ కార్యక్రమాలను ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా ఎంవిఆర్ మాట్లాడుతూ క్లబ్‌కు తన పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శ్రీనాథ శ్రీను, ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పట్టా సుదర్శన్, చైర్మన్ యాద నాగేశ్వరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రామకృష్ణ, సిఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

13న పంచశీల శాంతి యాత్ర

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రసిద్ధ బౌద్ధ ఆరామక్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ఈ నెల 13న విశాఖ బౌద్ధ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో పంచశీల శాంతి యాత్ర నిర్వహించనున్నట్లు సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు బల్ల నాగభూషణం తెలిపారు. ఆదివారం సంఘ కార్యాలయంలో కరపత్రాన్ని బౌద్ధ సంఘాల సమాఖ్య సీనియర్ ఉపాధ్యక్షులు బోరా వేణుగోపాల్ గౌతమ్‌తో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బౌద్ధ స్థూపం వద్ద ప్రత్యేక పూజలు, విపస్సన ధ్యానం వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. బొజ్జన్న కొండ పరిసరాలను పరిశుభ్రం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి ఉజ్జి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, మల్లేశ్వరరావు కృష్ణమోహన్, బోరా లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాగభూషణం తదితరులు

రూ.49.50 లక్షలతో

ప్రభుత్వాసుపత్రిలో మౌలిక సదుపాయాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులతో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో మౌలిక వసతుల కల్పనకు రూ.49.50 లక్షల నిధులు మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. ఆదివారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో ఆయన సమావేశం నిర్వహించారు. మార్చురీ నిర్మాణానికి రూ.38 లక్షలు, ఆసుపత్రిలో వివిధ వసతులు సమకూర్చడానికి మరో రూ.8 లక్షలు, ఎలక్ట్రిసిటీ, తాగునీరు ఏర్పాటు కోసం మూడున్నర లక్షల రూపాయలు కేటాయించినట్లు చెప్పారు. చోడవరం మాడుగుల నియోజకవర్గాల్లో పెద్ద ఆసుపత్రి చోడవరంలో ఉందని, దీనిని మరింత అభివృద్ధి చేయవలసిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల రమేష్, ప్రధాన వైద్యులు వినయ్, కమిటీ సభ్యులు అన్నపూర్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

కె.కోటపాడు కేంద్రంగా పోలీసు సర్కిల్

అధికారిక ఉత్తర్వులు జారీ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కె.కోటపాడు పోలీసు స్టేషన్

ప్రజాశక్తి- కె.కోటపాడు

కె.కోటపాడు కేంద్రంగా కొత్తగా పోలీసు సర్కిల్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన తరువాత పోలీసు సేవలు విస్తరణలో భాగంగా ప్రభుత్వం కొత్త పోలీసు సబ్ డివిజన్లు, సర్కిళ్లను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా కె.కోటపాడు పోలీస్ సర్కిల్ ఏర్పాటుకు ఈ ఏడాది జూన్‌లో జిల్లా ఎస్‌పి గౌతమి శాలి ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వ కార్యదర్శి హరీష్ కుమార్ గుప్తా దానికి ఆమోదం తెలుపుతూ ఆదివారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. కె.కోటపాడు పోలీస్ సర్కిల్ పరిధిలో వి.మాడుగుల, దేవరాపల్లి, చీడికాడ, కె.కోటపాడు, ఎ.కోడూరు పోలీస్ స్టేషన్లను చేర్చారు. ఈ ఐదు స్టేషన్లు ఇప్పటివరకు చోడవరం పోలీసు సర్కిల్ పరిధిలో ఉండేవి. కె.కోటపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా తాతారావును ఉన్నతాధికారులు నియమించారు. కె.కోటపాడులో పోలీస్ స్టేషన్ నూతన భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. నూతన భవనంలోని పైభాగాన్ని సర్కిల్ కార్యాలయానికి ఉపయోగించనున్నట్లు పోలీసు అధికారులు చెబుతున్నారు.



అయ్యన్న పాత్రుడిని కలిసిన టిడిపి మండల నాయకులు

అయ్యన్నకు సంఘీభావం తెలిపిన టిడిపి నేతలు

ప్రజాశక్తి- మునగపాక రూరల్ : మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు చింతకాయల అయ్యన్న పాత్రుడికి టిడిపి మునగపాక మండల నాయకులు ఆదివారం ఆయన నివాసంలో కలిసి సంఘీభావం తెలియజేశారు. అయ్యన్నపాత్రుడికి అన్ని విధాలా అండగా ఉండటానికి పార్టీ మండల అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు తెలిపారు. బీసీ సాధికార సమితి సభ్యుడు యల్లపు శ్రావణ్ కుమార్, ఐటిడిపి అధ్యక్షులు శరగడం యోగి నాగేశ్వరరావు, మండల కార్యనిర్వహణ కార్యదర్శి దొడ్డి రమేష్, మళ్ల రాజేష్, తెలుగు యువత మండల అధ్యక్షులు ఉల్లింగల సంతోష్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - చోడవరం : మండలంలోని వెంకన్నపాలెం భూలోక మాత గుడి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు చోడవరం పోలీసులు మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని వయసు 30 సంవత్సరాలు ఉంటుందని ఎస్ఐ యమున తెలిపారు. కొద్ది రోజులుగా వెంకన్నపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడని స్థానికులు చెప్పినట్లు పోలీసులు చెప్పారు.

నేడు సాంబమూర్తి శూలాల మహోత్సవం

ప్రజాశక్తి -మునగపాక రూరల్ : మునగపాక పంచాయతీ వీధిలోని సాంబమూర్తి దేవస్థానంలో ఈ నెల 7న సోమవారం సాంబమూర్తి శూ లాల మహోత్సవం నిర్వహిస్తున్నామని, ఇందులో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని దేవస్థాన కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. సాంబమూర్తి ఆలయంలో ఆదివారం శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ, ఉత్తరాంధ్రలో ప్రసిద్ధిగాంచిన సాంబశివుని శూలాల మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. సోమవారం ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేయడంతో పాటుగా, రాత్రికి నూలు దారాలతో అలంకరించిన గుమ్మటంపై ఊరేగింపు జరుగుతుందని పేర్కొన్నారు. శూలాలతో నృత్యాలు, నేలవేషాలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బంగారయ్యపేటలో....

కశింకోట : మండలంలోని బంగారయ్య పేట గ్రామంలో సోమవారం చౌడేశ్వరి సాంబమూర్తి శులాల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ ప్రతినిధులు కుందెం షణ్ముఖ, మల్లేశ్వర రావు, ఆంధ్ర ప్రసాద్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం పూజలు, సాయంత్రం పురవీధుల్లో శులాలతో ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

యోగాతో ఆరోగ్యం

ప్రజాశక్తి- అనకాపల్లి : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని ఆంధ్ర యూనివర్సిటీ యోగ విభాగాధిపతి కె.రమేష్ బాబు అన్నారు. మండలంలోని తుమ్మపాల యోగ లైఫ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో యోగ, ధ్యానంపై నిర్వహించిన శిక్షణ తరగతులకు ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవితం ఆరోగ్యంగా, సాఫీగా సాగాలంటే యోగ ప్రధాన మార్గమన్నారు. ఆంధ్ర యూనివర్సిటీలో యోగాకు సంబంధించిన పలు కోర్సులను యోగ లైఫ్ సెంటర్తో కలిపి అందిస్తున్నట్లు తెలిపారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు ఈ కోర్సులు ఎంతో ఉపకరిస్తాయన్నారు. అనంతరం యోగాలో ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో యోగ లైఫ్ సొసైటీ వ్యవస్థాపకుడు కరణం బాబురావు, యోగ శిక్షకులు జి రవికుమార్, మణికంఠ, కె.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎయు యోగా విభాగాధిపతి రమేష్

ప్రజాసంకల్ప యాత్ర ఐదేళ్ల సంబరాలు

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి ప్రభుత్వం నవరత్నాలు పేరుతో రూపొందించిన పథకాలకు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజా సంకల్ప యాత్రే మూలమని వైసిపి పట్టణ అధ్యక్షులు బొద్దపు ఎర్రయ్యదొర అన్నారు. సంకల్ప యాత్రకు ఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో నూటికి నూరుశాతం నెరవేర్చినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బోదెపు గోవిందరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ గుప్తా, కౌన్సిలర్లు శానపతి రాము, కొఠారు కొండబాబు, దూది నరసింహమూర్తి, సంతోష్, గొర్లె వెంకట్, మరిడేశ్వరరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి వైసిపి కార్యాలయంలో...

అనకాపల్లి : స్థానిక రింగ్ రోడ్‌లోని వైసిపి కార్యాలయంలో ఆదివారం ప్రజా సంకల్ప యాత్ర చేపట్టి ఐదేళ్ళు పూర్తవుతున్న సందర్భంగా ఆ పార్టీ నాయకులు మందపాటి జానకి రామరాజు, జాజుల రమేష్, కార్పొరేటర్ జాజుల ప్రసన్న లక్ష్మి ఆదివారం కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ శివ, పార్టీ నాయకులు దాడి నారాయణరావు, సకల గోవింద, కోరుకొండ రాఘవ, రమేష్ గుప్తా పాల్గొన్నారు.



వైఎస్‌కు నివాళులర్పిస్తున్న రత్నాకర్ తదితరులు

జివిఎంసి 80వ వైసిపి కార్యాలయంలో వైసిపి పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ముందుగా వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి కార్పొరేటర్ కొణతాల నీలిమ భాస్కరరావుతో కలసి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల కృష్ణ అప్పారావు, దాడి ఈశ్వరరావు, కర్రి గణేష్, భీశెట్టి కృష్ణ అప్పారావు, కర్రి అప్పాజీ, బిఎస్‌కె.నాయుడు, పొలిమేర శివ అప్పారావు పాల్గొన్నారు.

మాడుగులలో...



రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాల వేస్తున్న వైసిపి నేతలు

మాడుగుల : సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రజాసంకల్పయాత్ర ప్రారంభించి ఐదేళ్ళు పూర్తయిన సందర్భంగా ఆదివారం మాడుగులలో వైసిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. బస్‌స్టాండ్‌లో రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ ఎడ్ల కళావతి, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, ఎంపిటిసి పొలిమెర విజయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యురాలు ఉన్నిష, కుక్కర్ మహేశ్వరి పాల్గొన్నారు

క్రీడల్లో రాణించడానికి ప్రత్యేక శిక్షణ అవసరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం

క్రీడల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించడానికి ప్రత్యేకమైన శిక్షణ పొందాల్సిన అవసరం ఉందని స్థానిక సిఐ పి.శంకర్రావు అన్నారు. మండలంలోని నునపర్తి గ్రామంలో ఆదివారం శ్రీరామ బాల్ బ్యాడ్మింటన్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్లబ్ క్రీడా ప్రాంగణంలో క్రీడాకారులకు శిక్షణ తరగతులను సిఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు టీ షర్ట్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈనెల 11, 12, 13 తేదీలలో ప్రకాశం జిల్లా చేపూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అండర్-16 బాల బాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు ఈ శిక్షణ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అచ్యుతాపురం మండలం బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు గొంప నరసింహనాయుడు, ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు, క్లబ్ సభ్యులు రెడ్డి కన్నమనాయుడు, రెడ్డి దేముడు, రెడ్డి అప్పారావు, కోచ్ దోకుల శ్రీను, దోకుల రమేష్, దోకుల నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న క్రీడాకారులతో సిఐ శంకరరావు తదితరులు

బ్రాండిక్స్ ఆధ్వర్యాన 'స్వచ్ఛ పూడిమడక'



తీరంలో క్లీనింగ్‌లో పాల్గొన్న దొరస్వామి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

మన ఊరి పరిశుభ్రత మన అందరి బాధ్యత అనే నినాదంతో మండలంలోని పూడిమడకను స్వచ్ఛ పూడిమడక గ్రామంగా తీర్చిదిద్దడానికి బ్రాండిక్స్ యాజమాన్యం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా గ్రామంలోని యువకులను, రాజకీయ నాయకులను కలుపుకొని సమిష్టిగా గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టింది. ఆదివారం బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి గ్రామ యువకులతో కలిసి శ్రమదానం చేసి పూడిమడక సాగర తీరంలో వ్యర్థాలను ఏరి బీచ్‌ను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా 94 ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి వేలాది మందికి కంటి అద్దాలు, క్యాటరాక్ట్ ఆపరేషన్లు, శస్త్ర చికిత్సలు చేయించినట్లు చెప్పారు. యుక్త వయసులో ఉన్న యువతలకు ప్రత్యేకమైన వైద్య శిబిరాలు నిర్వహించి బాలికలకు మందులు, న్యాప్‌కిన్ ప్యాడ్స్ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. పరిసరాల పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు. మద్యం తాగుడు నుంచి దూరం చేయడానికి చైతన్య కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు.



బీచ్ క్లీనింగ్‌లో పాల్గొన్న కలెక్టర్, హెచ్‌పిసిఎల్ అధికారులు, అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు

బీచ్ క్లీనప్‌లో అమ్మ ఛారిటబుల్ ట్రస్టు

ప్రజాశక్తి - విశాఖపట్నం

విశాఖపట్నం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ రాజాబాబు పిలుపు మేరకు స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో హెచ్‌పిసిఎల్ రిఫైనరీ, అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివారం సాగర్ నగర్ బీచ్‌లో సుమారు 3 కిలోమీటర్ల మేరకు జరిగిన బీచ్ క్లీనప్ కార్యక్రమంలో అమ్మ ఛారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు 20 గన్నీ బ్యాగ్‌లతో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను, గాజు సీసాలను సేకరించి జివిఎంసి అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున, జివిఎంసి కమిషనర్ రాజాబాబు, హెచ్‌పిసిఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ కె.నగేష్, సిఎస్ఆర్ జనరల్ మేనేజర్ కాళీ, ఇతర అధికారులు అమ్మ ఛారిటబుల్ ట్రస్టు సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ గొంప వెంకటరావు, వైస్ చైర్మన్ సింగంపల్లి అర్జున, ఉపాధ్యాయులు సూరెడ్డి బాబూరావు, ఎరుకునాయుడు, మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు ట్రస్టు సభ్యులు కాకర ఈశ్వరరావు, కిల్లి నూకరాజు, లెక్కల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మండలంలోని మర్రిబంద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.... మర్రిబంద గ్రామానికి చెందిన యాక చిలకమ్మ (62) ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో తన కుటుంబానికి చెందిన వరి పొలం చూడటానికి జాతీయ రహదారి వెంబడి వెళ్తుంది. ఇదే సమయంలో గుర్తు తెలియని వాహనం ఆమె బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో చిలకమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. అటుగా వెళుతున్న గ్రామస్తులు మృతదేహాన్ని చూసి యలమంచిలి రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యలమంచిలి రూరల్ ఎస్ఐ కె.సన్నిబాబు తెలిపారు.

నత్తనడకన జగనన్న ఇళ్ల నిర్మాణాలు

- కనీస సౌకర్యాలు లేక ముందుకు సాగని పనులు
- సదుపాయాల కల్పనలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం
- లబ్ధిదారులపై ఒత్తిడికే పరిమితమైన అధికారులు



పునాది గోతుల స్థాయిలోనే ఆగిపోయిన జగనన్న ఇళ్ల నిర్మాణాలు

ప్రజాశక్తి-రోలుగుంట : ప్రతి ఒక్కరికీ సొంతింటి కల సాకారం చేయాలనే సంకల్పంతో చేపట్టిన జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు మండల కేంద్రమైన రోలుగుంటలో నత్తనడకన సాగుతున్నాయి. శరభవరం శివారు గ్రామమైన అర్లలో ప్రారంభం కాలేదు. కుసర్లపూడి గ్రామంలో లేఅవుట్ వేసిన కాలనీకి మౌలిక సదుపాయాలు లేక లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. నిర్మాణంలో ముందున్నా ఎక్కువ నష్టపోతున్నామని వాపోతున్నారు. పెరుగుతున్న మెటీరియల్ ధరలతోపాటు రహదారి సౌకర్యం లేని పరిస్థితుల్లో ఇసుక, ఇనుము, సిమెంట్, పిక్క, మెట్ల పైకి మోసుకెళ్లాల్సి వస్తోందని, దీంతో ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి ఖర్చులు తడిసి మోపెడై రూ. 10లక్షలు దాటిపోతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇంటి నిర్మాణం కోసం ఉన్న స్థిరాస్తులు అమ్ముకోవడమో లేకుంటే అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తుందేమోనని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రోలుగుంట మండలంలో జగనన్న లేఅవుట్లలో 552 మందికి, సొంత స్థలాలు ఉన్నవారికి 1158 మందికి, మొత్తంగా 1710 ఇళ్ల మంజూరయ్యాయి. మండల కేంద్రంలో మూడు ప్రాంతాల్లో జగనన్న కాలనీలకు స్థలాలు మంజూరు చేశారు. కొండపాలెం గ్రామస్థులతో పాటు ఇచ్చిన స్థలంలో 17 మందికి, కొండను ఆనుకొని పాత క్రషర్ వద్ద 26 మందికి, గౌరమ్మ కోనేరు దిగువ భాగాన 9 మందికి స్థలాలు పంపిణీ చేశారు. వారిలో కొండపాలెం గ్రామస్తులతో ఇచ్చిన లబ్ధిదారులు ఇళ్ల ప్రారంభించి శ్లాబ్ లెవెల్ వరకు పూర్తిచేశారు. మిగతా 35 మంది దగ్గర ఒక్కొక్కరి వద్ద రూ.30వేల అధికారులు, స్థానిక వైసిపి నాయకులు కలిసి వసూలు చేసి కాంట్రాక్టర్‌కు ఇళ్ల నిర్మాణం పూర్తి చేయుటకు ఒప్పందం కుదుర్చుకున్నారు. పాత క్రషర్ వద్ద పునాది గొయ్యిలు తీసి మెటీరియల్ వేసి ఇటీవల ఆరుఇళ్లకు పిల్లర్లు వేశారు. గౌరమ్మ కోనేరు వద్ద పనులు ప్రారంభించలేదు. శరభవరం పంచాయతీ అర్ల గ్రామంలో 41 మందికి ఇళు మంజూరు కాగా, నేటికి ఒక్కటి కూడా ప్రారంభించ లేదు. అర్ల గ్రామం కొండపైన ఉంది. దానికి రహదారి



జగనన్న లేఅవుట్‌లో తవ్విన బోరు పాయింట్

సౌకర్యం లేదు. ముందుగా వేస్తే గానీ, నిర్మాణ సామగ్రి అక్కడకు తీసుకెళ్లి పనులు చేపట్టేందుకు అవకాశం లేదు. గ్రామంలో 41 మంది ఎస్‌టికి చెందినవారే ఉండగా, ఈ గ్రామానికి టిడిపి ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణానికి రూ.మూడు కోట్లు మంజూరైనా, పనులు ప్రారంభించడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో ఆ నిధులు మురిగిపోయాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్ల గడచినా రహదారి గురించి పట్టించుకునేవారు లేరు. మరోవైపు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలని లబ్ధిదారులపై అధికారులు తీవ్రమైన ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో రోడ్డు లేకుండా పనులు ప్రారంభించి, వాటిని ఎలా పూర్తిచేయగలమని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందుగా రహదారి నిర్మించి, తర్వాత తమకు ఇళ్ల నిర్మాణంపై ఒత్తిడి చేయాలని వారంతా కోరుతున్నారు.

ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న కుసర్లపూడి లబ్ధిదారులు పనులు ప్రారంభించి, ఇళ్లనిర్మాణ స్థలానికి మెటీరియల్‌ను తీసుకెళ్లేందుకు ఎన్ని అవస్థలు పడుతున్నారో అధికారులు పరిశీలించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతున్నారు. జగనన్న లేఅవుట్‌లో ఒకేఒక బోరు వేయడం వల్ల దాదాపు అరకిలోమీటరు దూరం నీటిని మోసుకెళ్లి నిర్మాణ పనులు చేపట్టడం ఇబ్బందిగా ఉందని, దీనిపై అధికారులు దృష్టి పెట్టాలని కోరుతున్నారు. అలాగే, లేఅవుట్‌కు రహదారి, విద్యుత్, నీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరుతున్నారు.

సత్యవరంలో భారీ అగ్ని ప్రమాదం

పలు హోటళ్లు, దుకాణాల దగ్ధం

విద్యుత్ వైర్లు నుంచి నిప్పులు రాలడంతో ఘటన

గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రజలు బెంబేలు

ప్రజాశక్తి -పాయకరావుపేట : మండలంలోని సత్యవరం గ్రామంలో ఆదివారం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది పాత సత్యవరం వినాయక గుడి సెంటర్‌లో విద్యుత్ వైర్లు చెట్టు కొమ్మలకు తగిలి నిప్పురవ్వలు పడడంతో తుంపా రమణ, తుంపా వీరబాబులకు చెందిన హోటల్, సక్లేట్ దుర్గారావుకు చెందిన తమలపాకుల కంపెనీ, ఉప్పు చల్లారావు చెందిన జమ్ము, స్పేయర్స్, పరదాలు, సెలూన్ షాపు, మటన్ దుకాణం, మరికొన్ని షాపులు, పాకలు అగ్నికి ఆహుతయ్యాయి. హోటల్‌లో రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు భారీగా ఎగసిపడ్డాయి. స్థానికులు, యువకులు ధైర్యంగా మంటలను అదుపులోకి తీసుకొచ్చారు నక్కపల్లి, తుని నుంచి రెండు అగ్నిమాపక వాహనాలు వచ్చి మంటలను పూర్తిగా ఆపేశారు. అగ్నిప్రమాద సమయంలో గ్యాస్ సిలెండర్లు పేలుతున్నా స్థానిక యువత ధైర్యంగా ముందుకొచ్చి మంటలను అదుపులోకి తేవడంతో పెద్దప్రమాదమే తప్పిందని అగ్నిమాపక సిబ్బంది అనానరు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20లక్షల ఆస్తి నష్టం సంభవించిందని భావిస్తున్నారు.. స్థానిక సర్పంచ్ రాము, ఎంఆర్‌ఒ టి.త్రినాథ్, విఆర్‌ఒ వి.స్వామి బాధితులను పరామర్శించారు.ప్రమాద నష్టాన్ని అధికారుల ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు.

సమస్యలపై సచివాలయ ఉద్యోగుల వినతి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : గ్రామ సచివాలయ, వార్డు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎపి ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఛైర్మన్, గ్రామ వార్డు ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాకర్ల వెంకట రామిరెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు నక్కపల్లి మండలం గ్రామవార్డు, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు కంబాల రాజు తెలిపారు. ఆదివారం అనకాపల్లిలో జరిగిన జిల్లా గ్రామ,వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మీయ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకటరామిరెడ్డి దృష్టికి గ్రామ వార్డు , సచివాలయ ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు , ఇంక్రిమెంట్లు, ఉద్యోగుల హెల్త్ కార్డు, తదితర సమస్యలను తీసుకెళ్లారు. దీనిపై ఆయన స్పందిస్తూ, .ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి జగన్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా వెంకటరామిరెడ్డిని సత్కరించారు. కార్యక్రమంలో నక్కపల్లి మండలం వైస్ ప్రెసిడెంట్ జీనాథ్ ఆమెన్, గొల్లపల్లి వెంకటేష్, జనరల్ సెక్రెటరీ కారే శేఖర్, ట్రెజరర్ చందా కొండలరావు, పైడిరాజు, జాయింట్ సెక్రటరీ పద్మజ , కార్యవర్గ సభ్యులు పందిరి వెంకటేష్, కాంట్రకోట రమణమ్మ పాల్గొన్నారు.

గుంతల రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు



రోడ్డులోని గోతులను కప్పుతున్న ఆర్అండ్‌బి అధికారులు

ప్రజాశక్తి- రావికమతం : ఆర్అండ్‌బి రోడ్లలో గుంతలను గుడ్డిప సర్పంచు గుమ్మాల గణేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చేసే పనులు చేపట్టారు గొంప జంక్షన్ నుంచి తట్టబంద జంక్షన్ వరకు సుమారు మూడు కిలోమీటర్ల రోడ్డులోని గుంతలను బ్లేడు ట్రాక్టర్‌తో చదును చేసి, క్వారీ పిక్కతో గోతులను పూడ్చేశారు. తద్వారా ఈ రోడ్డు మార్గం గుండా రావికమతం, పిల్లవానిపాలెం, దాసరయ్యపాలెం, మరుపాక, గొంప, గుడ్డిప , తట్టబంద, తోటకూర పాలెం తదితర గ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇక్కట్లు కొంతమేర తొలగించే చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు గల్లా శ్రీనివాసరావు, ఎన్నంసెటి సత్తిబాబు, సంజీవ్ , వాలంటీర్ లక్ష్మి ప్రసాద్ పాల్గొన్నారు. అలాగే రావికమతం నుంచి కింతలి వెళ్లే ఆర్అండ్‌బి రోడ్డు గుంతలను ఆర్అండ్‌బి అధికారులు పూడ్చారు. రావికమతం నుంచి కెబిపి అగ్రహారం వరకు సుమారు ఐదు కిలోమీటర్ల రోడ్డు మధ్యలో గుంతలను తారురోడ్డుతో పూడ్చారు. తద్వారా కింతలి, పొంగలిపాక, శివరాంపురం, కవగుంట, బుడ్డి బంద, కొమిరా , కెబిపి అగ్రహారం, చినపాచిల, గుమ్మాలపాడు, పెదపాచిల తదితర గ్రామాల ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టారు.

ఎన్ఎఒబి నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న అమ్మోరయ్య

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎన్ఎఒబి నిర్వాసిత మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరియ్య డిమాండ్ చేశారు. ఆదివారం రాంబిల్లి మండలం ఎన్ఎఒబి మెయిన్ గేట్ వద్ద ఆందోళన చేస్తున్న నిర్వాసిత మత్స్యకారులను కలిసి, వారికి జెఎసి తరపు సంఘీభావం ప్రకటించారు. మత్స్యకారుల సమస్యల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్యధోరణితో వ్యవహరించడం దారుణమని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో మత్స్యకార జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేరుగు కొర్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు, రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, రాష్ట్ర విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి చెల్లూరి మల్లికార్జున, మైలపల్లి శ్రీనివాస్, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు పిక్కిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల శ్రీనివాసరావు, రాంబిల్లి మండల అధ్యక్షులు చింతకాయల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు .

తుప్పలతో రాకపోకలకు ఇక్కట్లు

నిర్వహణ విషయం మరిచిపోయిన ఆర్అండ్‌బి అధికారులు

ప్రమాదభయంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న వాహనదారులు



ఇరువైపులా తుప్పలు పెరిగిన కెజె.పురం రహదారి

ప్రజాశక్తి-మాడుగుల : రహదారుల నిర్వహణ సక్రమంగా లేక ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బి పరిధిలోని పలు రహదారులకు రెండువైపులా ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు తొలగించకపోవడంతో వాహనదారులు భయం భయంగా ప్రయాణం చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల నుంచి కెజె.పురం వెళ్ళే మార్గంలో రోడ్డుకు ఇరువైపుల తుప్పలు పేరుకుపోవడంతో ప్రజలు, వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. ఏపుగా పెరిగిన తుప్పలు రోడ్డును కమ్మేయడంతో రోడ్డు ఇరుకుగా మారడంతో పాటు మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేని పరిస్థితుల్లో ప్రమాదాలు పొంచి ఉన్నాయని భయాందోళనలు చెందుతున్నారు. ఇదే మాదిరిగా మాడుగుల కోడూరు రహదారిలో సైతం ఇదే ఇబ్బందికర పరిస్థితి ఉంది. కొన్నాళ్లుగా రోడ్డు నిర్వహణ, ఇలా జంగిల్ క్లియరెన్స్ చేపట్టకపోవడం వాహనదారులు భయం భయంగా ప్రయాణించవలసి వస్తుంది. మండలంలోని పలు రహదారుల్లో ఇదే పరిస్థితి ఉంది. అనేక ప్రధాన రహదారులు నిర్వహణ లేక గోతులతో అధ్వాన్నమై ప్రయాణసంకటంగా ఉండగా, దానికి తోడు అన్నట్లు తుప్పలు కమ్మేయడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా .ఘాట్ రోడ్ నుండి కోడూరు, వడ్డాది వైపు రహదారులు పూర్తి శిథిలావస్థకు చేరాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొన్ని రహదారులకు జంగిల్ క్లియరెన్స్ చేపట్టినా కొన్నాళ్లపాటు వాహనదారులు ఇబ్బందులు లేకుండా ప్రయాణించవచ్చనే అభిప్రాయం వ్యక్తమౌతోంది.

ప్రధాని మోడీతో ఉక్కు ప్రకటన చేయించాలి

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై ముఖ్యమంత్రికి సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు లేఖ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : దేశ ప్రధాని మోడీ విశాఖ పర్యటన సందర్భంగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకునేలా అతనితో ప్రకటన చేయించాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు సిఎం జగన్మోహన్ రెడ్డికి లేఖ రాశారు. అందులోని విషయాలను ఆదివారం మీడియాకు వివరించారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్ర అసెంబ్లీలోను, జివిఎంసి కౌన్సిల్‌లోనూ తీర్మానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉక్కు కార్మికులు 635 రోజుల నుంచి ఉద్యమం సాగిస్తున్నారని, తెలుగు జాతి ఏకోన్ముఖంగా ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా పోరాడుతోందని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలూ బిజెపి నిర్ణయాన్ని నిరసిస్తున్నాయని అన్నారు. అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వైఖరిలో ఎటువంటి మార్పూ లేదన్నారు. పైపెచ్చు ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అమ్మి తీరుతామని కేంద్ర మంత్రులు పదేపదే ప్రకటించడం దారుణమన్నారు. ఇప్పటికే న్యాయ, బదిలీ, ఆస్తుల మదింపు కమిటీలను కూడా ప్రభుత్వం ప్లాంట్ విక్రయానికి నియమించిందన్నారు. రెండో వైపు స్టీల్‌ప్లాంట్‌ను తీవ్ర నష్టాల పాలుజేసే కుట్రలకు మోడీ ప్రభుత్వం ఒడిగట్టిందన్నారు. ప్లాంట్ పూర్తి సామర్థ్యాన్ని వినియోగించుకోనీయకుండా అనేక ఆంక్షలు విధించిందని తెలిపారు. కనీసం 2021-22 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ఉత్పత్తి స్థాయిలో కూడా ప్లాంట్‌ను రన్ చేయనేయకుండా అనేక డిపార్టుమెంట్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించేశారన్నారు. మూడో బ్లాస్ట్ ఫర్నేస్‌ను మూసేశారని తెలిపారు. ఒడిశా నుండి బొగ్గు సరఫరాకు అవసరమైన రైల్ వ్యాగన్‌లను తగ్గించేసారన్నారు. విద్యుత్‌కు అవసరమైన బొగ్గును సరఫరా చేయడం లేదని తెలిపారు. బ్యాంకుల నుండి వర్కింగ్ క్యాపిటల్ సమకూర్చుకోవటానికి కూడా ఆంక్షలు విధించారన్నారు. ఉత్పత్తిని భారీగా తగ్గించి ఉత్పత్తి వ్యయాన్ని పెంచే చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. ఈ విధంగా ప్లాంట్‌ను పూర్తిగా నష్టాలు పాల్జేసి ప్రజల్లో ప్లాంట్ పట్ల వ్యతిరేక భావనను సృష్టించి అమ్మేయాలని బిజెపి కుట్ర పన్నిందన్నారు. మోడీ ఈ నెల 11, 12 తేదీలలో విశాఖలో పర్యటిస్తున్న నేపథ్యంలో స్టీల్‌ప్లాంట్ ప్రాధాన్యతను వివరించి అమ్మకపు నిర్ణయాన్ని ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటన చేయించాలని కోరారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి సామర్థ్యంలో పనిచేసేలా, సొంత ముడి ఇనుప గనులు కేటాయించేలా, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలన్నారు. ఆయన వద్దకు విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులను, జివిఎంసి కౌన్సిల్‌లోని మేయర్‌తో పాటు వివిధ రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లను తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

అయ్యన్నకు టిడిపి నేతల సంఘీభావం



అయ్యన్నతో మాట్లాడుతున్న కేంద్ర మాజీ మంత్రి అశోకగజపతిరాజు

ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్ : ఇటీవల సిఐడి పోలీసులు అరెస్టు చేయడంతో బెయిల్‌పై వచ్చిన మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆదివారం నర్సీపట్నంలోని ఆయన నివాసంలో మాజీ కేంద్రమంత్రి పూసపాటి అశోక్ గణపతిరాజు, ఇతర నేతలు పరామర్శించి, సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా అశోక్ గజపతిరాజు మాట్లాడుతూ రాష్ట్రంలోని వ్యవస్థలన్నీ అధ్వానంగా తయారయ్యా యన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకు కళ్లెం వేయాలని చూడటం సరికాదన్నారు. అయ్యన్నను పరామర్శించిన వారిలో నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణస్వామి ఉన్నారు. రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సుమారు 150 కార్లలో భారీ ర్యాలీగా అయ్యన్నను పరామర్శించడానికి తరలివచ్చారు.

మత్స్యకారుల సమస్యలపై పోరాటం



నియామక పత్రం అందజేస్తున్న జెఎసి రాష్ట్ర నాయకులు

ప్రజాశక్తి -నక్కపల్లి : మత్స్యకారుల సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరాటం చేయాలని ఎపి మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరియ్య అన్నారు. ఆదివారం మత్స్యకార జెఎసి నేతల సమక్షంలో ఆదివారం ఎపి మత్స్యకార జెఎసి రాష్ట్ర విద్యార్థి ప్రధాన కార్యదర్శిగా చెల్లూరి మల్లికార్జున, రాంబిల్లి మండల అధ్యక్షులుగా చింతకాయల దుర్గాప్రసాద్‌లను ఎంపిక చేసి, వారికి నియామక పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా మత్స్యకార జెఎసి నాయకులు మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన రసాయన పరిశ్రమల వ్యర్థాలు సముద్రంలోకి వదలడం వలన మత్స్య సంపద నశించి, మత్స్యకారులకు జీవనోఉపాధి దూరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల ఉనికికి ప్రమాదకరంగా మారిన రసాయన పరిశ్రమలపై ఐక్యపోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార జెఎసి రాష్ట్ర ఉపాధ్యక్షులు మేరుగు కొర్లయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు, రాష్ట్ర కార్యదర్శి వాసుపల్లి నూకరాజు, జిల్లా అధ్యక్షులు పిక్కిస్వామి, జిల్లా జనరల్ సెక్రటరీ చింతకాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు .

నేటి నుంచి భూముల రీసర్వే

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలో భూముల రీసర్వే కార్యక్రమం ఈ నెల 7 నుంచి పోలవరం గ్రామం నుంచే ప్రారంభమౌతుందని ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఆనంద్ తెలిపారు. పోలవరం గ్రామంలోని రైతులంతా అందుబాటులో ఉండి సర్వే చేయించుకోవాలన్నారు. పోలవరంలో సర్వే పూర్తయిన తర్వాత తాళ్ళచీడికాడ, నాగన్నదొరపాలెం, కేడిపేట, చీడిగుమ్మల, లింగన్నదొరపాలెం, యరకంపేట, ఏఎల్‌పురం గ్రామాల్లో భూసర్వే జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని, సర్వేకు సహకరించాలన్నారు. రీసర్వేతో భూవివాదాలకు ఆస్కారముండదని తహశీల్దార్ ఆనంద్ అన్నారు.

బడి మానితే భవిష్యత్తు నాశనం

గైర్హాజరైన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు తెలుగు మాస్టారి కౌన్సిలింగ్

ప్రజాశక్తి -నక్కపల్లి : పాఠశాలకు గైర్హాజరైతే బంగారు భవిష్యత్ నాశనమౌతుందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు నక్కపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌విఎస్ ఆచార్యులు కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పాఠశాలకు సక్రమంగా హాజరు కాని విద్యార్థులను గుర్తించి, వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులు, వారితో మాట్లాడి రెగ్యులర్‌గా రప్పించేలా ఆచార్యులు మాస్టారు చేస్తున్న కృషి మంచి ఫలితాలనే ఇస్తోంది.

ఆదివారం మండలంలోని ఉపమాక పంచాయతీ శివారు మామిడివానిపాలేనికి చెందిన పలువురు విద్యార్థులు స్కూలుకు గైర్హాజరు కావడంతో వారి ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను కలిశారు. విద్యార్థులు పాఠశాలకు రాకపోవడానికి కారణాలపై ఆరా తీశారు. ఈసందర్భంగా వారితో మాట్లాడుతూ,రెగ్యులర్‌గా స్కూల్‌కు రాకపోతే చదువులో వెనకబడిపోతారని, తద్వారా వారి భవిష్యత్ పాడౌతుందని వివరించారు. రెగ్యులర్ తమ పిల్లలను పాఠశాలకు పంపాలని, అలాగే బడి నుంచి ఇంటికి వచ్చిన తర్వాత కూడా వారి చదువుపై దృష్టి పెట్టాలని అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యాపథకాలను సద్వినియోగం పరుచుకుని బాగా చదివితే మంచి ఉద్యోగం, లేదా ఉపాధితో వారి భవిష్యత్ బాగుపడుతుందని తల్లిదండ్రులను ఒప్పించారు.



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆచార్యులు మాస్టారు

భవన నిర్మాణ కార్మికునికి ఆర్థిక సాయం



ఆర్థికసాయాన్ని అందిస్తున్న తోటి కార్మికులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిని నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన శ్రీ వినాయక భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ సేవా సంఘం సభ్యుడు కొల్లు బాబులుకు తోటి కార్మికులు అండగా నిలిచారు. రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి, ఉపాధికి దూరమైన ఆయనకు తోటి కార్మికులు రూ.ఐదువేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎల్‌వి. రమణ మాట్లాడుతూ కార్మిక సంక్షేమ బోర్డును ప్రభుత్వం నిర్వీర్యం చేయడం వల్ల కార్మికులు ప్రమాదాల బారిన పడి ఉపాధి కోల్పోయిన పరిస్థితుల్లో బోర్డు నుంచి ఎటువంటి ఆర్థికభరోసా లేని దుర్భర పరిస్థితి నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు పథకాలు అందక కార్మికులు నానా ఇబ్బందులు పడుతున్నారని ఇలాగే అనేక కుటుంబాలు రోడ్డు పడ్డాయన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో తోటి కార్మికులంతా అండగా నిలవడం హర్షనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు అల్లు ఎరుకునాయుడు, రుత్తల బాబులు, పారుపల్లి రామకృష్ణ, ఆళ్ల సత్తిబాబు, పిండి శ్రీను పాల్గొన్నారు.

342వ రోజుకు మత్స్యకారుల దీక్షలు

ప్రజాశక్తి -నక్కపల్లి : హెటిరో పైప్‌లైన్ పూర్తిగా తొలగించాలని మత్స్యకార జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు, మహాధర్నా ఆదివారం నాటికి 342వ రోజుకు చేరింది. ఆందోళన శిబిరం వద్ద మత్స్యకారులు పైప్‌లైన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు .కంపెనీ వ్యర్థ జలాలు సముద్రం, ఉప్పుటేరులోకి వదలడం వలన మత్స్యసంపద నశించి, తామంతా ఉపాధి కోల్పోయి రోడ్డున పడడంతోపాటు పొట్టచేతబట్టుకుని పనుల కోసం వలస పోయే పరిస్థితులు ఉత్పన్నమౌతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.తాము 342 రోజులుగా ఆందోళన చేస్తున్నా ప్రభుత్వంగానీ, అధికారులు గానీ సమస్య పరిష్కారానికి చొరవ చూపకపోవడం దారుణమన్నారు. సమస్య శాశ్వతంగా పరిష్కారం అయ్యేవరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు కార్యక్రమంలో ఎపి మత్స్యకార జెఎసి జిల్లా అధ్యక్షులు పిక్కి స్వామి, నాయకులు వాసపల్లి నూకరాజు, గోసల స్వామి, కోసల వెంకటేష్, మైలపల్లి శివ, శ్రీను ,చొక్కా గోపి పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న మత్స్యకారులు

అనర్హులకు ఇళ్ల స్థలాలపై చర్యలేవీ ?



అనర్హుల ఇళ్లను చూపుతున్న మాజీ జెడ్‌పిటిసి వేణుగోపాల్

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని ఎఎల్‌పురంలో అనర్హులకు కేటాయించిన ఇళ్లస్థలాలపై ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని మాజీ జెడ్‌పిటిసి చిటికెల తారకవేణుగోపాల్ అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ గతంలో 13 మంది అనర్హులకు ఇళ్లస్థలాలు కేటాయించారని అప్పట్లో తహశీల్దార్‌కు తెలియజేస్తే, కేవలం ఒక్కరిపైనే చర్యలు తీసుకుని, అతను కట్టిన పునాదిని తొలగించేశారని, మిగిలిన 12మందిపై ఎటువంటి చర్యల్లేకుండా విడిచిపెట్టేశారన్నారు. దీనిపై ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు.

తమ తాత వెంకటరమణ సర్పంచ్‌గా ఉన్నప్పుడు ఎస్‌సి, బిసి కాలనీలకు స్థలాన్ని ఇవ్వగా, అప్పట్లో మాదిగలకు ఇచ్చిన స్థలంలో కమ్యూనిటీ హాల్, బిసిలకు ఇచ్చిన స్థలంలో ప్రజా మరుగుదొడ్లు నిర్మించుకున్నారన్నారు. టీడీపీ హయాంలో కమ్యూనిటీ హాల్ నిర్మించుకుంటామని ఇచ్చిన స్థలంలో నేడు వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అనర్హులకు పట్టాలు ఇచ్చారన్నారు. దీనిపై కాలనీలోని ఎస్‌సి, బిసిలకు పోరాడుతూ, అధికారులకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదన్నారు. తానుకూడా ఆర్‌డిఒకు విన్నవించినా ఎటువంటి ఫలితం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజావసరాల కోసం ఉపయోగపడే స్థలంలో అనర్హులకు ఇళ్లస్థలాలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

గొడిచెర్లలో ఉచిత నేత్ర వైద్యసేవలు

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని గొడిచెర్ల గ్రామంలో ఆదివారం విజన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. .గ్రామ సర్పంచ్ అల్లు పార్వతి ప్రారంభించిన కంటి శిబిరంలో నేత్రవైద్య నిపుణులు డాక్టర్ గుట్టల రేష్మ పాల్గొని రోగులకు పరీక్షించారు. దృష్టి లోపం ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు అందజేశారు. అంతరకుసుమాలున్న వారికి ఉచితంగా ఐఒఎల్ ఆపరేషన్ నిర్వహించి కంటిచూపు ప్రసాదిస్తామన్నారు. కార్యక్రమంలో విజన్ కంటి ఆసుపత్రి సిబ్బంది, వైసిపి నాయకులు అల్లు రమణ ,నల్లల రామకృష్ణ , జి రమణ పాల్గొన్నారు .



కంటి సంరక్షణపై సూచనలు చేస్తున్న డాక్టర్ రేష్మ